
సాక్షి
మంచిర్యాల
మంగళవారం, 10, సెప్టెంబర్, 2024

కొనసాగుతున్న ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేత



దిగువకు ప్రవహిస్తున్న వరద

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత కొనసాగుతోంది. డీఈ స్వామి వరదను సమీక్షిస్తూ నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను సోమవారం 18.715 టీఎంసీలు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 82 వేల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 63 వేల క్యూసెక్కులు వరద వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 309 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు తరలిస్తుండగా, 20 గేట్లు ఎత్తి 1.52 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాగా, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏఈ రాజ్‌కుమార్ వరద పరిస్థితులను కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి తీసుకెళ్తున్నారు.

న్యూస్‌రీల్

'కాళోజీ' జీవితం స్ఫూర్తిదాయకం



నివాళులు అర్పిస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు రచనలు, ఆచరించిన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో ఎదుర్కొంటున్న సమస్యలపై తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని తెలిపారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యం అందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సోమవారం తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ప్రతీ వార్డుకు వెళ్లి వైద్య సేవలు ఎలా ఉన్నాయి, మందులు, అందిస్తున్నారా, వైద్యులు, వైద్య సిబ్బంది చికిత్సను ఎలా అందిస్తున్నారు, పరిశుభ్రతను పాటించి, సౌకర్యాలను కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. మంచిర్యాలలో నూతన ఆసుపత్రుల నిర్మాణంతో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు లభించేలా చూస్తామన్నారు. వచ్చే ఏడాదిన్నరలో ఐబీ స్థలంలో ఆసుపత్రి భవనం ప్రారంభం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, వైద్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో నిమజ్జనం



ఘాట్ వద్ద పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

చెన్నూర్: జిల్లాలో వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని పెద్ద చెరువు నిమజ్జన ఘాట్‌ను మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చెన్నూర్‌లో ఈ నెల 15న నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెన్నూర్, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్, కమిషనర్ గంగాధర్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

జైపూర్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో చివరి రోజు నిర్వహించే శోభాయాత్రలు, నిమజ్జనం బందోబస్తు ఏర్పాట్లను డీసీపీ భాస్కర్ సోమవారం పరిశీలించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా సరిహద్దు ప్రాంతమైన గోదావరి బ్రిడ్జి వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించి పోలీసులకు సూచనలు చేశారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

వీడని వాన



ఇది భీమిని మండలం కమలాపూర్ చెరువు. దీనికింద 3,800 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల వర్షాలకు కమలాపూర్–లక్ష్మీపూర్‌కు మధ్య కాలువకు గండిపడింది. అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించారు. పూర్తి స్థాయిలో నిధులు విడుదలైతేనే మరమ్మతులు జరిగే అవకాశం ఉంది.



చెన్నూరు మండలం కంబోజీపేట చెరువుకు తాత్కాలిక మరమ్మతులు

- అధిక వర్షాలతో ఇబ్బందులు
- కుంటలు, చెరువులకు గండ్లు
- గోదావరి, ప్రాణహిత నదులకు వరద
- సెప్టెంబర్‌లోనే అధిక వర్షపాతం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వర్షం తెరిపిస్తూ.. కురుస్తుండడంతో జిల్లాలో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. రెండ్రోజుల క్రితం గోదావరి, ప్రాణహిత నదులకు ప్రవాహం తగ్గింది. మళ్లీ గోదావరిలోకి వరద చేరుతోంది. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మళ్లీ వరద చేరడంతో గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. దీంతో అధికారులు నదీతీరాల్లో ఉన్న రైతులు, సమీప గ్రామాలు, పట్టణాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆయా శాఖల వారీగా నష్టం అంచనా కోరడంతో జిల్లాలో పలు శాఖల అధికారులు నివేదికలు అందజేస్తున్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో నష్టం అంచనా వేస్తుండగా.. జిల్లాలో రోడ్లు, భవనాలు, ఇతర పరిధిలో నష్టం తీవ్రత తక్కువగానే ఉంది. ఇదేతీరుగా వర్షం కొనసాగితే మాత్రం నష్టం పెరిగే అవకాశం ఉంది. పట్టణాల్లో వర్షం కురిసిన సమయంలో రోడ్లపై వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, సాగునీటి వనరుల్లో నీరు భారీగా చేరాయి. జిల్లాలో 625 చెరువులు ఉండగా, దాదాపు అన్నింటా నీరు చేరింది. ఇంకా వరద కొనసాగితే ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. సీజన్ ఆరంభంలో కంటే సెప్టెంబర్‌లోనే అధిక వర్షపాతం నమోదవుతోంది.

చెరువులు, కుంటలకు గండ్లు

జిల్లాలో సాగునీటి శాఖ పరిధిలోని పలు చెరువులు, కుంటలు, కాలువలకు గండ్లు, బుంగలు పడ్డాయి. క్షేత్రస్థాయిలో నష్టం జరగకుండా సాగునీటి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గత జూలైలో వర్షాలు కురిసినప్పటి నుంచి అక్కడ సాగునీటి వనరులు దెబ్బతిన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నష్టం తక్కువగా ఉన్నా మరమ్మతులకు నిధులు కావాల్సి ఉంది. సాగునీటి, మధ్యతరహా ప్రాజెక్టు పరిధిలో ఉన్న పలు నీటి వనరులు దెబ్బతిన్నాయి. తాండూరు మండలంలో అచ్చాలపూర్, నల్లవాగు ప్రాజెక్టు, తాండూరులోని మేకలవని చెరువు, గంపలపల్లి పెద్ద చెరువు, ద్వారకాపూర్‌లోని రాముని చెరువు, భీమిని మండలం కర్జీభీంపూర్, కమలాపూర్, బిర్వపల్లి రామారావుపేట్‌చెరువు, వెంకటాపూర్‌లో కాలువ, పెద్దతిమ్మాపూర్ పెద్ద చెరువు, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి ఊర చెరువు, గురజాల పోచమ్మ చెరువు, అంకుసం ఊరచెరవు, ఎర్రకుంట, భీమారం మండలం బూరుగుపల్లె పాతకుంట దెబ్బతిన్నాయి. కోటపల్లి మండలం ఏదులబంధం గ్రామంలోని తుతుంగ వాగు కుడి కాలువ కోతకు గురైంది.

ముసురుకుంది..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సోమవా రం ఉదయం నుంచి ఒకటే తీరు ముసురు వర్షం కురిసింది. రోజంతా ముసురు వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వారం రో జుల క్రితం కురిసిన ఎడతెరిపి లేని భారీ వ ర్షాలతో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. మళ్లీ ముసురు వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరద నీరు, పూత, కాత వస్తున్న పత్తి పంటకు అధిక తేమతో నష్టం వాటిల్లుతుందని వాపోయా రు. ముసురు వర్షానికి తోడు చల్లని ఈదురు గాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 15.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేమనపల్లి మండలంలో 34.1 మిల్లీమీటర్లు, కోటపల్లిలో 34.8, భీమినిలో 21.5, భీమారంలో 26.3, చెన్నూర్‌లో 25.3, నెన్నెలలో 19, కన్నెపల్లిలో 19.1, కాసిపేటలో 14.1, బెల్లంపల్లిలో 10.3, మందమర్రిలో 10.2, జైపూర్‌లో 10.3, నస్పూర్‌లో 9.5, దండేపల్లిలో 7.9, మంచిర్యాలలో 7.3, తాండూర్‌లో 6.9, హాజీపూర్‌లో 6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 830 మిల్లీమీటర్లు కాగా 917.2 మిల్లీమీటర్లు కురిసింది. 11 శాతం అధికంగా నమోదైంది.

జిల్లాలో చెరువుల్లో నీటి నిల్వలు

25శాతం	75-100	పూర్తిస్థాయి	మొత్తం
02	282	341	625

కుంటలు, చెరువులు, మరమ్మతులకు

తాత్కాలిక	రూ.11.07కోట్లు
శాశ్వత	రూ.423.00కోట్లు
దెబ్బతిన్న కాలువ/కుంట/తూములు	19
తాత్కాలికంగా మరమ్మతులు చేసినవి	12

జిల్లాలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం

సాధారణం	830.మి.మీ.
కురిసింది	917.2మి.మీ.

ఉప్పొంగిన లొత్తొర్రె



వాగు దాటుతున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలో విస్తారంగా కురిసిన వర్షాలకు వాగులు, గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహించాయి. సోమవారం తెల్లవారుజామున నక్కలపల్లి లొత్తొర్రె ఉప్పొంగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నక్కలపల్లి, బ్రహ్మణపల్లి, చామనపల్లి, బద్దెంపల్లి, బొమ్మెన గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒకరినొకరు పట్టుకుని వాగుదాటారు. వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచిన రాకపోకలు



నెన్నెల ఎర్రవాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

నెన్నెల: భారీ వర్షాలకు మండలంలోని లంబాడితండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో సోమవారం ఎనిమిది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లంబాడి తండా, కుర్మగూడం, కోణంపేట, బోగంపల్లి, మన్నెగూడం, ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరమయ్యారు. తహసీల్దార్ రమేష్, ఎస్సై ప్రసాద్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్ వాగును పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగుకు అడ్డంగా బారికేడ్లు, ట్రాక్టర్లు నిలిపి రాకపోకలు నియంత్రించారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ సిబ్బందిని కాపలా ఉంచారు. ఎర్రవాగు, దమ్మిరెడ్డిపేట వాగుపై వంతెనలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.

వేమనపల్లిలో..



నీట మునిగిన పత్తి పంట

వేమనపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు వరద నీటితో పరవళ్లు తొక్కాయి. నీల్వాయి వాగు వరద నీటి ప్రవాహం పెరగడంతో ప్రాజెక్టు మత్తడి గుండా భారీగా వరద వాగులోకి వెళ్తోంది. చామనపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో అవతలి వైపు ఉన్న చామనపల్లి, బొమ్మెన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వేమనపల్లిలో ఎంచపాయ, సండెంక ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల పత్తి, మిర్చి పంటలు నీటమునిగాయి.

ఎట్టకేలకు 'గుర్తింపు' దక్కింది..



ప్రాతినిధ్య సంఘంగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఐఎన్టీయూసీ నాయకులు



గుర్తింపు పత్రం అందుకుంటున్న గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు, అధ్యక్షుడు సీతారామయ్య

- ధ్రువీకరణ పత్రాలు అందజేత
- సింగరేణిలో రెండేళ్ల పదవీ కాలం

శ్రీరాంపూర్/రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)కు ఎట్టకేలకు 'గుర్తింపు' లభించింది. ఏడు నెలల అనంతరం సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ధ్రువీకరణ పత్రాలను యాజమాన్యం అందజేసింది. కంపెనీ స్థాయిలో గుర్తింపు సంఘం, ఏరియాలో గెలిచిన ప్రాతినిధ్య సంఘాలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లకు సింగరేణి సీఎండీ బలరాం సమక్షంలో డెప్యూటీ సీఎల్సీ శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇక నుంచి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం విధిగా స్ట్రక్చరల్, ఇతర సమావేశాలు నిర్వహించాలని అన్నారు. గుర్తింపు సంఘం కాల పరిమితి నాలుగేళ్లు ఉండాలని, కానీ రెండేళ్లకు ఇవ్వడం వల్ల కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, మిర్యాల రాజిరెడ్డి, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్కే బాజీసైదా, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్టీయూసీ..

సింగరేణిలో పలు ఏరియాల్లో అధిక ఓట్లు సాధించి ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన ఐఎన్టీయూసీకి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఎండీ యన్.బలరాం, డెప్యూటీ సీఎల్సీ శ్రీనివాస్ చేతుల మీదుగా ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, శంకర్‌రావు, వికాస్‌కుమార్ పాల్గొన్నారు.

'విశ్వసనీయతను కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం'



సభ్యత్వ నమోదు కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయలతో కలిసి ప్రారంభించారు. పలువురు న్యాయవాదులు బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకోగా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌బాబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బూత్ స్థాయిలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి భారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరుముళ్ల పోషం, ఎనగందుల కృష్ణమూర్తి, దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, అక్కల రమేశ్, మాను రజని, గుండా ప్రభాకర్, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, న్యాయవాదులు కర్ర లచ్చన్న, తులా ఆంజనేయులు, కొట్టె నటేశ్వర్, ఇండ్ల వెంకటి, నరేందర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, పరిహారం, రుణమాఫీ, విద్యుత్ తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఆయా శాఖలకు అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. మావోయిస్టుగా లొంగిపోయిన తనకు పునరావాసం కింద ఇచ్చిన భూమిలో సాంఘిక సంక్షేమ పాఠశాల ఏర్పాటు చేశారని, మరోచోట భూమి ఇప్పించాలని కోటపల్లి మండలం దేవులాడకు చెందిన ఆసరెల్లి సమ్మయ్య కోరారు.

- తన పట్టా భూమి ధరణి పోర్టల్‌లో మరొకరికి వారసత్వంగా వచ్చినట్లు చూపుతోందని మందమర్రి పట్టణం 3వ జోన్‌కు చెందిన రొడ్డ మల్లయ్య, తన భూమి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకపోవడం వల్ల రైతుబంధు రావడం లేదని, ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని జన్నారం మండలం కొమ్ముగూడెంకు చెందిన అజ్మీర చంద్రకళ అర్జీ అందజేశారు.
- డీడీలు కట్టి మూడేళ్లు అవుతున్నా గొర్రెలు ఇవ్వలేదని, ఆలస్యం చేయకుండా డబ్బులు ఇప్పించాలని భీమిని మండలం తెనుగుపల్లికి చెందిన ఎగ్గ పోషమల్లక్క, ఎగ్గ శంకరమ్మ కోరారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదు..



నెన్నెల మండలం గొల్లపల్లి శివారులో సర్వేనంబర్ 332లో 6.37 ఎకరాలు జగిత్యాల జిల్లా గుల్లకోటకు చెందిన దమ్ము సునిత వద్ద కొనుగోలు చేశాం. రిజిస్ట్రేషన్ కోసం ఆగస్టు 7న స్లాట్ బుక్ చేసుకున్నాం. నెన్నెల తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకుండా తిప్పించుకుంటున్నారు. ఎలాంటి వివాదం లేకున్నా తాత్సారం చేస్తున్నారు.
– చింత మానస, అంబిలపు ప్రశాంత్, చింత సంధ్య, చింత శైలజ, గ్రామం: గొల్లపల్లి, మం: నెన్నెల

రుణమాఫీ కాలేదు..



తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.75 లక్షలు పంట లోను మాఫీ కాలేదు. నా రేషన్‌కార్డులో మాకు సంబంధం లేని వారి పేరుతో రూ.30 వేల లోను తీసుకున్నట్లు ఉంది. రూ.రెండు లక్షల కన్న ఎక్కువగా ఉందని చూపిస్తుంది. రేషన్‌కార్డు, బ్యాంకు బుక్ పరిశీలించి రుణమాఫీ చేయాలి. – కస్తూరి మల్లయ్య, గ్రామం: పొన్నారం, మం: చెన్నూర్

రోగులకు మెరుగైన సేవలందించాలి



చెన్నూర్ పెద్ద చెరువును సందర్శిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి

- పారిశుధ్యం లోపించకుండా చూడాలి
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి

చెన్నూర్/కోటపల్లి: సీజనల్ వ్యాధుల నివారణకు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఆమె చెన్నూర్, కోటపల్లి మండలాల్లో పర్యటించారు. చెన్నూర్ మున్సిపల్ కార్యాలయం, లైన్ గడ్డ, సామాజిక ఆరోగ్య కేంద్రం, పెద్దచెరువు, కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. చెన్నూర్‌లోని పెద్దచెరువు నిండుకుండలా ఉందని, కట్టకు ఏమైనా ప్రమాదం ఉంటుందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో రికార్డులు పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వర సర్వే పక్కాగా చేయాలని, అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మరో రెండ్రోజులు భారీ వర్షాలు ఉండడంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అలుగామ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. చెత్త పేరుకుపోయి ఉండడంతో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. గ్రామంలో జ్వర సర్వేపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా.. జరిగిందని చెప్పారు. గ్రామస్తులను అడిగితే అలాంటిదేమీ లేదని చెప్పడంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణహిత నదిలో పడవ ప్రయాణాలు నిషేధించాలని తెలిపారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహసీల్దార్లు మల్లికార్జున్, మహేంద్రనాథ్, ఎంపీడీవోలు శ్రీనివాస్, సత్యనారాయణ, ఏఈ సాయికిరణ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లికి గోదావరి జలాలు



ప్రజారోగ్య శాఖ అధికారులతో చర్చిస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: ఎల్లంపల్లి గోదావరి జలాలు బెల్లంపల్లి పట్టణానికి సరఫరా చేయిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం ఎల్లంపల్లి గోదావరి వాటర్ స్కీమ్ పాయింట్‌ను సందర్శించారు. ప్రజారోగ్య శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై గోదావరి జలాల సరఫరాపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడ ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే నీటిని తాగలేకపోతున్నామని పట్టణ ప్రజలు తన దృష్టికి తీసుకు వచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నానని పేర్కొన్నారు. అతి త్వరలో బెల్లంపల్లికి గోదావరి జలాలు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, మానసిక వైకల్యం ఏర్పడి మెదడు మొద్దుబారి పోతుందని తెలిపారు. బ్రహ్మకుమారీ పద్మ, ఏసీపీ ఏ.రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, కాంగ్రెస్ నాయకుడు దావ రమేష్, ముడుపు రవికుమార్ పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ఇంటెక్‌వెల్ సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని బెల్లంపల్లి మునిసిపాలిటీ మంచినీటి సరఫరా ఇంటెక్‌వెల్‌ను ఎమ్మెల్యే గడ్డం వినోద్ సోమవారం సందర్శించారు. మూడు పంపుసెట్లను పరిశీలించగా బెల్లంపల్లికి 6.50 మిలియన్ లీటర్ ఫర్ డే పంపించేలా ఇంటెక్‌వెల్ సామర్థ్యం ఉందని పబ్లిక్ హెల్త్ అధికారులు వివరించారు. బెల్లంపల్లికి నీటిని తరలించడానికి చేపట్టాల్సిన అంశాలపై ఆరా తీసి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పబ్లిక్ హెల్త్ డీఈ మధూకర్, ఏఈ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలి మృతి



వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్సై అభిబ్

జైపూర్: మండలంలోని వెంక్రటావుపల్లికి చెందిన వృద్ధురాలు దుర్గం శివమ్మ(77) పాముకాటుతో మృతి చెందిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. వెంక్రటావుపల్లిలో తన కుమార్తె గోదారి పద్మ ఇంటి వద్ద శివమ్మ ఉంటుంది. ఆదివారం రాత్రి అన్నం తిని అందరూ నిద్రించారు. మంచంపై నిద్రిస్తున్న శివమ్మను సోమవారం వేకువజామున పాము కాటు వేసింది. తన చేతికి ఏదో కుట్టిందని కుమార్తె పద్మను లేపగా ఆమె, అల్లుడు లక్ష్మణ్ చుట్టూపక్కల ఏమి కనిపించలేదు. శివమ్మ నోటి నుంచి నురుగులు రావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బురద గుంటలో పడి వ్యక్తి..



షేక్ హుస్సేన్ మృతదేహం

సిర్పూర్(టి): మద్యం మత్తులో ఇంటికి వెళ్లే దారిలో బురద గుంటలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తకాలనీలో నివాసం ఉంటున్న షేక్ హుస్సేన్ (45) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితమే భార్యతో విడాకులైంది. కొత్తకాలనీలో తన సోదరి సాబెరా బేగం ఇంట్లో ఉంటున్నాడు. హుస్సేన్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చి తిరిగి బీడీ తెచ్చుకుంటానని బయటకు వెళ్లాడు. ఇంటికి రాకపోయేసరికి ఎక్కడైన నిద్రపోయాడని సోదరి అనుకుంది. కొత్తకాలనీ ప్రధాన రహదారి నుంచి ఇంటి వెళ్లేదారిలో బురద గుంటలో హుస్సేన్ పడిపోయాడు. సోమవారం ఉదయం కాలనీవాసులు గుర్తించి సోదరికి సమాచారం అందించారు. సాబెరాబేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్సపొందుతూ ఒకరు మృతి చెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా హిరాపూర్ చెందిన ధన్‌లాల్ బావుసింగ్ (46) భార్య ఎనిమిది నెలల క్రితం మృతి చెందింది. మానసికంగా కుంగిపోయిన బావుసింగ్ ఈనెల 7న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభ ఉంటే రూ.పది లక్షలు మీవే!

- 'ఆర్బీఐ 90'పేరిట క్విజ్‌పోటీలు
- 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులు
- జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయస్థాయిల్లో పోటీలు
- ఈనెల 17 వరకు దరఖాస్తులకు గడువు
- ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యం



ఆన్‌లైన్ దరఖాస్తు హోమ్ పేజీ ఇదే

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. ఆర్బీఐ 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'ఆర్బీఐ 90 క్విజ్'పేరిట జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. ఈనెల 19 నుంచి 21 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చితే రూ.10 లక్షలు గెలుచుకునే అవకాశం ఉంది.

దరఖాస్తు విధానం ఇలా...

2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు వయసు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతున్నవారు పోటీల్లో పాల్గొనవచ్చు. www. rbi90 quiz. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 17లోగా దరఖాస్తులు చేసుకోవచ్చు. గుర్తింపు కార్డ్, ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయాలి. ఇందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక్కో కళాశాల నుంచి ఎంతమంది అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బృందానికి ఇద్దరు విద్యార్థులు ఉండాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బి.రాంగోపాల్, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ కోరుతున్నారు.

నాలుగు దశల్లో..

నాలుగు దశల్లో ఆర్బీఐ క్విజ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయి, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయి. మొదటి రౌండ్‌లో ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఇందులో 36 మల్టీపుల్ ప్రశ్నలు ఉంటాయి. 15 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇద్దరు విద్యార్థుల జతతో ఒకే పరికరం (ఫోను, టాబ్లెట్, లాప్‌టాప్, కంప్యూటర్) ద్వారా పోటీల్లో పాల్గొనాలి.

- విద్యార్థుల్లో ఆర్బీఐ ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీలు, సురక్షిత బాధ్యతాయుత వినియోగం తదితర వాటి గురించి యువతలో ప్రోత్సహించే లక్ష్యంతో ఈ క్విజ్‌పోటీలు నిర్వహిస్తోంది.
- దేశ, అంతర్జాతీయ, ఆర్థిక వ్యవహారాలు, ఆర్బీఐ చారిత్రక నేపథ్యం, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర సాహిత్యం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సమకాలీన అంశాలపై హిందీ, ఆంగ్లభాషల్లో ప్రశ్నలు ఉంటాయి.
- జిల్లాస్థాయి ఆన్‌లైన్ పోటీల్లో విజేతగా ఎంపికైన వారికి తదుపరి పోటీలకు హాజరయ్యేందుకు రవాణా, వసతి తదితర ఖర్చులను ఆర్బీఐ భరిస్తుంది. సంబంధిత కళాశాల అధ్యాపకుడు కూడా ఎంపికైన విద్యార్థులతోపాటు వెళ్లే అవకాశం కల్పిస్తుంది.

నగదు బహుమతుల వివరాలు

స్థాయి	ప్రథమ	ద్వితీయ	తృతీయ
రాష్ట్ర	రూ.2లక్షలు	రూ.1.50లక్షలు	రూ.లక్ష
జోనల్	రూ.5లక్షలు	రూ.4లక్షలు	రూ.3లక్షలు
జాతీయ	రూ.10లక్షలు	రూ.8లక్షలు	రూ.6లక్షలు

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



జన్నారంలో క్లూస్ టీంతో పరిశీలిస్తున్న సీఐ



ఆదర్శనగర్‌లో పగులగొట్టిన ఇంటి తాళం

జన్నారం/నిర్మల్‌టౌన్: తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడి చోరీకి పాల్పడిన ఘటన జన్నారం, నిర్మల్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జన్నారం మండలకేంద్రంలో రామ్‌సింగ్ రాజ్ పురోహిత్.. ఎలక్ట్రికల్, హార్డ్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు పైన ఇల్లు ఉంది. ఆదివారం రాత్రి ఇంటి తాళం వేసి సొంత పనిపై కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాల వెళ్లాడు. తిరిగి తెల్లవారు జాము 3 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. చూసేసరికి తాళం పగులగొట్టి బీరువాలో 4 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం లక్సెట్టిపేట సీఐ నరేందర్, జన్నారం ఎస్సై రాజవర్ధన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీంతో ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆదర్శనగర్‌లో..

నిర్మల్‌లోని ఆదర్శనగర్‌లో ఇంటికి తాళం వేసి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి బర్త్ డే వేడుకల కోసం బంధువుల ఇంటికి వెళ్లారు. నాలుగు రోజుల తర్వాత సోమవారం ఇంటికి తిరిగి వచ్చారు. చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రూ.30 వేల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సరస్వతీ అమ్మవారి సన్నిధిలో పూజలు



కుటుంబ సభ్యులతో అనిల్‌కుమార్

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ చీఫ్ గుమ్మడి అనిల్ కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనిల్ కుమార్ మనమరాలికి అర్చకులతో అన్నప్రాసన చేయించారు. ముందుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అనిల్ కుమార్‌కు బాసర లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను మాజీ సర్పంచ్ రమేశ్ వివరించారు. వెంటనే ఆయన స్పందించి రూ.20 కోట్ల వరకు ప్రతిపాదనలు చేసి పంపాలని డీఈ, జేఈలను ఆదేశించారు. వీరి వెంట ఏఈఈ రమేశ్, రజనీకాంత్, నాగరాజు ఉన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఎస్సై

మందమర్రిరూరల్: రామకృష్ణాపూర్ కోల్‌బెల్ట్ రహదారి సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లేదారి వద్ద పాలవాగులో పడి వ్యక్తి మృతిచెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. స్థానిక ప్రాణహిత (షిర్కే) కాలనీలో ఉంటున్న గాదె శ్రీనివాస్ (55) కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. పాలవాగు మూలమలుపు కల్వర్టు సమీపంలో దారి మైసమ్మ ఆలయం వద్ద భక్తులు ఇచ్చే చిల్లర డబ్బులతో మద్యం తాగేవాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ తిరిగిరాలేదు. భార్య రమాదేవి సోమవారం ఉదయం మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, గొడుగు ఉంది. అనుమానం వచ్చి వాగు వద్దకు వెళ్లి పరిశీలించగా మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని వాగులో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి గుర్తింపు

మంచిర్యాలక్రైం: ఈనెల 8న స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి భీమారం మండలం దాంపూర్‌కు చెందిన జంగొపెల్లి దుర్గయ్య(43) గుర్తించినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య వార్తను సోమవారం ఆయా దినపత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో కుటుంబ సభ్యులు గుర్తించారు. దుర్గయ్య బ్యాండ్ కొట్టుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యక్తిగత కారణాలతోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సంగీత, ఇద్దరు కూతుళ్లు హారిక, ప్రసన్న ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

నెన్నెల: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని వడ్లవాడలో వృద్ధ దంపతులు దురిశెట్టి మల్లయ్య–రాజుబాయికి చెందిన ఇల్లు సోమవారం కూలిపోయింది. ఆ సమయంలో వారు ఇంటి ముందు షెడ్‌లో ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేశ్, ఎస్సై ప్రసాద్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌లు కూలిన ఇంటిని పరిశీలించారు. వృద్ధ దంపతులకు పరిహారం అందేందుకు కృషి చేస్తామన్నారు. వారి వివరాలు సేకరించి నివేదిక అందించాలని ఆర్‌ఐ సులోచనకు తహసీల్దార్ ఆదేశించారు. వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా వేర్వేరుగా నివసిస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు పక్కనే ఉన్న పెద్ద కుమారుడు అంజన్న ఇంట్లో ఉండాలని అధికారులు వృద్ధులకు సూచించారు.

యువతి బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్దిపల్లి గ్రామ పంచాయతీలోని కొండాపూర్‌కు చెందిన ఎనగందుల జ్యోత్స్న (24) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆత్మహత్యకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా మృతురాలి తండ్రి చిన్నప్పుడే చనిపోగా, తల్లి రజిత, సోదరి భవాని ఉంది.

బాసర ఆలయం చుట్టూ సోలార్ కంచె



బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణం చుట్టూ సోమవారం సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ దొంగ ఆలయం లోపలికి చొరబడి చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఆలయం చుట్టూ సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఆలయ భద్రతకు సంబంధించి ఎస్సై గణేశ్, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.


ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా 'పాకాల'



నియామకపత్రం అందుకుంటున్న రాంచందర్

నిర్మల్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాకాల రాంచందర్ నియమితులయ్యారు. జిల్లాకేంద్రంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రామకష్ణ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సామకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్ల పోరాటానికి మద్దతుగా శ్రీరాంపూర్ ఓసీపీలో బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సోమవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ మాట్లాడుతూ కన్వేయన్స్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. వేతనాలు పెంచకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ సమస్యలపై ప్రశ్నించిన డ్రైవర్లను వాహనాల ఓనర్లు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మంచిర్యాలలో ఆపాలి

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య కొత్తగా నడిపే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును మంచిర్యాలలో ఆపేందుకు హాల్టింగ్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వేమంత్రితోపాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ జీఎంలకు సోమవారం లేఖ రాశారు. కొత్త రైలు కాజీపేట్, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షాలో ఆగుతుందని, దానిని మంచిర్యాలలో ఆగేలా చూడాలని కోరినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. మంచిర్యాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్, సికింద్రాబాద్, కాజీపేట్, రామగుండం, సిర్పూర్, బల్లార్షా, నాగ్‌పూర్ వెళ్తుంటారని వివరించారు. వందేభారత్ రైలును ఆపాలని కోరినట్లు తెలిపారు.

ఉరిశిక్ష పడే వరకు పోరాడతాం



గాదిగూడలోని కుమురం భీం చౌక్ వద్ద ఆదివాసీ గిరిజనుల నిరసన

ఆదిలాబాద్‌రూరల్/నార్నూర్(గాదిగూడ): జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరిశిక్ష పడేవరకు పోరాడతామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) మహిళా విభాగం జిల్లా కన్వీనర్ గోడం రేణుక తెలిపారు. సోమవారం మావల మండలం బట్టిసావర్‌గాం శివారులోని కుమురం భీం కాలనీలో ఆమె మాట్లాడారు. జైనూర్‌లో ఏజెన్సీ ప్రాంతం చట్టానికి అనుగుణంగా 1950 తర్వాత వలస వచ్చిన వారిని ప్రభుత్వం వెంటనే తరలించాలన్నారు. వారి భూ యజమాన్య హక్కు, ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ కార్డులు, వాణిజ్య వ్యాపార హక్కులు రద్దు చేయాలన్నారు. జైనూర్ ఘటనలో ఆదివాసీలపై ఎదురుదాడి చేసిన వారిపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితుడికి ఉరిశిక్ష పడేవరకు ఆదివాసీలంతా ఉద్యమిస్తామని ఝురి రాయిసెంటర్ సార్‌మెడి మందాడి దౌలత్ రావు, డోకారి(కే) మాజీ సర్పంచ్ మెస్రం దేవరావు తెలిపారు. గాదిగూడలోని కుమురం భీం చౌక్ వద్ద, లోకరి(కే) గ్రామ ప్రధాన రహదారి వద్ద నిరసన తెలిపారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా కో కన్వీనర్ ఉయిక ఇందిరా, మావల మండల అధ్యక్షురాలు కుమ్ర శాంతాబాయి, ప్రధాన కార్యదర్శి మడావి అనుసూయ, జంగుబాయి, కమల, చంద్రకళ, గితేదారి కొడప జాకు, మాజీ ఎంపీటీసీ సీడాం నాగరావ్, కుడ్మేత భారత్, తాజా మాజీ సర్పంచ్ మెస్రం జైవంత్ రావు, కుంరం శంకర్, నాయకులు పేందుర్ మరోతి, చిక్రం నాగరాజ్, 9 తెగల ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

రిమ్స్ బాత్రూంలో జారిపడి క్రికెటర్ మృతి



శ్రీహరి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన క్రికెటర్ (చిన్ను) శ్రీహరి (30) రిమ్స్ ఆస్పత్రి బాత్రూంలో జారిపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు..తన కుమారుడికి జ్వరం రావడంతో రిమ్స్‌లో ఇటీవల రక్తనమూనాలు ఇచ్చాడు. రిపోర్టు కోసం సోమవారం ల్యాబ్‌కు వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూమ్ వెళ్లగా కాలుజారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి సిబ్బందికి తెలియజేశారు. అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. బాత్రూం అపరిశుభ్రంగా ఉండడంతోనే కుమారుడు మృతిచెందినట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో తోటి క్రీడాకారులు కన్నీరుమున్నీరయ్యారు. క్రీడాకారుడి మృతిపట్ల బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్రీడా పోటీలు జరిగిన సమయంలో పలు సందర్భాల్లో ఆయన తన చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు గుర్తుచేశారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన ఆందోళనలు



విద్యార్థులతో వీసీ వెంకటరమణ

- విద్యార్థులతో సమావేశమైన అధికారులు
- దశలవారీగా సమస్యల పరిష్కారానికి హామీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు ముగిశాయి. తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరవధికంగా జరిగిన నిరసనలకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మద్దతు ప్రకటించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ విద్యార్థుల సమస్యలపై ఉన్నతాధికారులతో సోమవారం మాట్లాడారు. ఇటీవలే నిర్మల్‌కు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుతోనూ ట్రిపుల్‌ఐటీ ఇబ్బందులపై చర్చించారు. తాజాగా సోమవారం ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ ట్రిపుల్‌ఐటీలో అడ్మినిస్ట్రేషన్, చీఫ్ వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్‌తో పాటు అధికారులతో కలిసి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల డిమాండ్లపై చర్చించారు. రెగ్యులర్ వీసీతో పాటు హాస్టల్ మరమ్మతులు, వైఫై సమస్యలు, సెంట్రల్ లైబ్రరీ, ఆసుపత్రి, ఆర్థిక వ్యవహారాల లావాదేవీలు, గడువు ముగిసిన టెండర్లు, మెస్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించి దశలవారీగా పరిష్కారానికి హామి ఇచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా చూడాలని కోరారు. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో చర్చించి ఈ సమస్యలను పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని అధికారుల హామీతో విద్యార్థులు శాంతించారు.

ట్రిపుల్‌ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలి



సర్దార్ వినోద్‌కుమార్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజులుగా తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ స్పందించడంలేదన్నారు. పైగా ఇక్కడి అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారులను క్యాంపస్ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు నిరసనలు చేస్తే మద్దతుగా వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులను లోనికి అనుమతించడం లేదన్నారు. ట్రిపుల్‌ఐటీలో జరిగిన అక్రమాలపై తన వద్ద పూర్తిస్థాయి ఆధారాలు ఉన్నాయని, త్వరలో విద్యార్థి సంఘాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

వన్యప్రాణుల వేటాడుతున్న ఐదుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన కొడకొప్పుల చంద్రగౌడ్, కుడ్మెత రాజు, తలండి సురేశ్, దుర్గం శ్రీను, కుడ్మెత మధునయ్యలు గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో 33కేవీ విద్యుత్ లైన్‌కు సరఫరా చేసి వన్యప్రాణులను వేటాడుతున్నారు. స్థానికుల సమాచారంతో వారిని అరెస్ట్ చేసి తహసీల్దార్ రమేశ్ ఎదుట బైండోవర్ చేశారు. రూ.లక్ష సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణుల వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



చిన్న భూమన్న మృతదేహం

జైనథ్: మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు అల్లకొండ చిన్న భూమన్న (64) గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. చిన్న భూమన్న గత ఐదేళ్లుగా అస్తమాతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు అతన్ని పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈనెల 7న రాత్రి భూమన్నకు శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయింది. దీంతో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ఆయన్ను వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుమారుడు గణేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి వివాహిత..

లోకేశ్వరం: చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన సుంకరి సాయవ్వ (45)–విఠల్ భార్యభర్తలు. వీరిద్దరు పుస్పూర్‌లో పాలేరుగా పని చేస్తున్నారు. కొంత కాలంగా సాయవ్వకు మతిస్థితం లేక తిరుగుతుండేది. ఈనెల 6న ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. వారు ఫిర్యాదుతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి సాయవ్వ ఆచూకీ కోసం గాలిస్తుండగా పుస్పూర్ గ్రామంలోని చెరువులో శవమై సోమవారం కనిపించింది. మృతురాలు చెల్లెలు రామేలి అనురాధ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.